## క్లుప్తంగా

### నేడు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

**మాడుగుల రూరల్:** కె.జె.పురం పీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రధాన వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు ఆదివారం తెలిపారు. ప్రధానమంత్రి మాతృత్వ ఆరోగ్య సురక్ష అభియాన్‌లో భాగంగా గర్భిణులకు ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు అన్ని రకాలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

### డీసీసీ అధ్యక్షుడిగా సుబ్బన్న నియామకంపై హర్షం

**మాడుగుల రూరల్:** జిల్లా కాంగ్రెసు కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా మీసాల సుబ్బన్న నియామకంపై పీసీసీ కార్యదర్శి పదాల కొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మరలా పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బుడబండి రాజు, యూత్ అధ్యక్షుడి ఏసురాజు, సీనియర్ నాయకులు పుట్టా అమరయ్యగుప్తా, ఆర్లె ధనుంజయ్, తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

### సదరం క్యాంపునకు హాజరు కావాలి

**కె.కోటపాడు:** అనకాపల్లిలో ఎన్టీఆర్ గ్రౌండ్ వద్ద సోమవారం సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు వ్యాధి నిర్ధారత చేయనున్నట్లు తెలిపారు. తలసేమియా, సికెల్ సెల్, హిమోఫిలియా, ద్వైపాక్షిత ఎలిఫెంటో యాసిస్ వంటి దీర్ఘకాలికమైన వ్యాధిగ్రస్తులు శిబిరంలో నిర్ధారిత పరీక్షలు చేసుకోవచ్చన్నారు. అర్హత గల వారికి డీఎంహెచ్‌వో పెన్షన్‌లను మంజూరు చేస్తారన్నారు. సోమవారం కె.కోటపాడు, సబ్బవరం, దేవరాపల్లి మండలాలకు చెందిన వారికి సదరం క్యాంపులో పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

### డెయిరీ సభ్య రైతులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న పెదనాయుడు, అయ్యప్పనాయుడు

**దేవరాపల్లి:** తెనుగుపూడి విశాఖ డెయిరీ పాల సమీకరణ కేంద్రంలో సభ్య రైతులకు దుప్పట్లను పంపిణీ చేశారు. విశాఖ డెయిరీ సరఫరా చేసిన దుప్పట్లను స్థానిక పాల సొసైటీ అధ్యక్షుడు అయ్యప్పనాయుడు, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు పాడి రైతులకు అందజేశారు. స్థానిక పాల సొసైటీ వేతన కార్యదర్శి పి. శ్రీను, వారాది గౌరినాయుడు, గురువు నాయుడు, గంటా రాము, చామంతుల చిన్న తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి బోరు పనులు ప్రారంభం


బోరు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి జెడ్పీటీసీ అప్పలనర్స

**నాతవరం:** గ్రామాభివృద్ధికి పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా దివంగత నేత జమీలు వర్ధంతి రోజున బోరు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స అన్నారు. శనివారం నాతవరంలో తాగునీటి బోరు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ ప్రాంతంలో రైతులకు పశువులు తాగునీటి కోసం ఇబ్బందులు తీరనున్నాయన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

### స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 10న రాస్తారోకో

**అనకాపల్లి :** విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 10న కూర్మనపాలెంలో రాస్తారోకో నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, 1300 రోజులుగా కార్మిక సంఘాలు నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమను నష్టాల బాటలోకి నెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు.




బుచ్చెయ్యపేట: ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు అడ్డంగా కట్టిన కర్రలు


మాడుగుల రూరల్: కె.జె.పురంలో వరినాట్లలో చేరిన వర్షపు నీరు


బుచ్చెయ్యపేట: బీఎన్ రోడ్డులో చేరిన నీటిలో నుంచి వస్తున్న వాహనాలు


కె.కోటపాడు: చౌడువాడలో రోడ్డుపై నుంచి పారుతున్న వర్షపునీరు

# ఏకధాటిగా వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- దెబ్బతిన్న తాచేరు డైవర్షన్ రోడ్డు
- బీఎన్ రోడ్డులో నిలిచిన రాకపోకలు
- ప్రయాణికులకు అవస్థలు


మాడుగుల రూరల్: వి.వి. అగ్రహారం వద్ద పొంగి ప్రవహిస్తున్న శారదా నది

**నర్సీపట్నం:** వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి వరకు వర్షం పడుతూనే ఉంది. కురుస్తున్న వర్షాలతో జన జీవనం స్తంభించింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఇళ్లకే పరిమితమయ్యారు. కురిసిన వర్షానికి పట్టణంలోని డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చెరువులను తలపించింది.

**అప్రమత్తమైన అధికారులు**

**బుచ్చెయ్యపేట:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి మొదలైన వాన విడవకుండా కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై వరద నీరు పారుతోంది. వాగులు, నదులు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద నీటి ప్రవాహానికి విజయ రామరాజుపేట డైవర్షన్ రోడ్డు పాడైంది. నీటి ప్రవాహంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికార్లు శుక్రవారం అర్ధరాత్రి నుంచి బీఎన్ రోడ్డులో వాహనాలు రాకపోకలు నియంత్రిస్తూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. రేయిబంవళ్ల తాచేరు వంతెన వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాచేరు డైవర్షన్ రోడ్డుపై రాకపోకలు లేకుండా చేయడంతో విశాఖపట్నం, పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనాం, గౌరీపట్నం, బుచ్చెయ్యపేట రోడ్ల మీదుగా వాహనాలు మళ్లించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి అవస్థలు పడుతున్నారు. వడ్డాది పెద్దేరు నదిపై డైవర్షన్ రోడ్డు ఆనుకుని వరద నీరు ప్రవహిస్తోంది. ఆర్అండ్‌బీ రోడ్డు గోతుల్లో నీరు చేరి బురదమయంగా తయారయ్యాయి.

**పొంగి ప్రవహిస్తున్న తాచేరు, శారద నదులు**

**మాడుగుల రూరల్:** ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మండలంలో తాచేరు, శారద, పాలగెడ్డ, చింతగెడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతోపాటు పెద్దేరు, తారకరామ, పాలగెడ్డ, ఉరకగెడ్డ, జలాశయాల్లో నీటమట్టం క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకు పరిమితమయ్యారు. వరి పంట నీట మునిగింది. చెరకు తోటల్లో నీరు చేరింది. తాచేరు, పాలగెడ్డ, నది పరివాహకంలో పొలాలు నీట మునిగాయి. గ్రామీణ రహదారులు గోతులమయంగా మారడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గరికబంద నుంచి వడ్డాది పోవు రహదారిలో పలు చోట్ల గండ్లు పడ్డాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 29.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయిందని తహసీల్దారు పి.వి.రత్నం తెలిపారు.

**కె.కోటపాడులో 32.8 మిల్లీమీటర్ల వర్షపాతం**

**కె.కోటపాడు:** మండల వ్యాప్తంగా ఆదివారం 32.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. మల్లంపాలెం, బంటు వారి నివాసాలు, రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల, పాడుగుపాలెం ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. భారీ వర్షాలతో వరి పొలాల్లోకి భారీగా వర్షపునీరు చేరుతోంది. సింగన్నదొరపాలెం వద్ద మొండిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది.

**మాకవరపాలెంలో 47.6 ఎం.ఎం. వర్షపాతం**

**మాకవరపాలెం:** మండలంలో 47.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శనివారం 16.8 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా, ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 30.8 ఎం.ఎం. నమోదైంది. ఈ నేపథ్యంలో చెరువులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. సర్పానది వరద నీటితో కళకళలాడుతోంది. మరో రెండు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే వరి పంట నీట మునగనుంది. ఇప్పటికే కోడూరు, గిడుతూరు, తాడపాల, తామరం గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా తొలగించుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు.


కె.కోటపాడు: సింగన్నదొరపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మొండిగెడ్డ


బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో నీటి ముంపులో పంటలు


మాడుగుల రూరల్: తారకరామ జలాశయంలో చేరిన వరద నీరు


నర్సీపట్నం: గొడుగుల మాటున బైక్‌లపై ప్రయాణిస్తున్న ప్రజలు

### ప్రమాదకరంగా గోతులు


పాఠశాల వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక

**రోలుగుంట:** స్థానిక ఎంపీపీ పాఠశాల వద్ద రోడ్డుపై గోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో వాహనచోదకులు, విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలకు బీఎన్ రోడ్డులో కంచుగుమల కూడలి నుంచి వెలంకాయలపాలెం వరకూ రోడ్డు దెబ్బతింది. పలు చోట్ల గోతులు ఏర్పడి పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగు రోజులుగా ఎంపీపీ పాఠశాల వద్ద పలువురు అదుపు తప్పి గోతుల్లో పడి గాయాల పాలయ్యారు. ఇక్కడ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు తాత్కాలికంగా గోతులు పూడ్చి, ఇక్కడ హెచ్చరికగా ఎర్రజెండా ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని వాహన చోదకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ఎస్‌ఐను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎస్‌ఐ మల్లేశ్వరరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**దేవరాపల్లి:** నూతన ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావును వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన్ను కలిసి శాలువాతో సత్కరించారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, సీనియర్ నాయకులు సోమిరెడ్డి పేరునాయుడు, చొక్కాకుల వెంకటరమణ, ఉల్లి బాషా, కొరుపోలు శ్రీను, గంగవంశం సంతోష్, ఎలుసూరి అప్పారావు తదితరులు ఎస్‌ఐను కలిసిన వారిలో ఉన్నారు.

# శ్రీగణనాథం.. భజామ్యహం

- వాడవాడలా చవితి వేడుకలు
- వీధివీధినా కొలువుదీరిన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో పూజలు

గణనాథుడు కొలువుదీరిన వేళ.. ఊరూవాడా సందడి నెలకొంది. శనివారం వినాయక చవితి సందర్భంగా గ్రామగ్రామాన పోటాపోటీగా మండపాలను అలంకరించారు. ఈ సందర్భంగా విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడికి భక్తులు తొలి పూజ చేశారు. జై గణేషా.. జై జైగణేషా నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.


నర్సీపట్నం: అయ్యారక వీధిలో ఏర్పాటు చేసిన 22 అడుగుల మట్టి విగ్రహం


నర్సీపట్నం: రామరావుపేటలో శివగణనాథుడు


నర్సీపట్నం: వీర్రాజు థియేటర్ వీధిలో..


అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు


రోలుగుంటలో అన్నదాన కార్యక్రమం


మాకవరపాలెం రాజారావుపేటలో విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న మహిళలు


దేవరాపల్లి: ములకలాపల్లి వినాయక మండపం వద్ద అభయాంజనేయ యూత్ సభ్యుల సందడి


మాడుగుల రూరల్: కె.జె.పురం ప్రధాన కళావేదికపై భారీ గణనాథుడు


దేవరాపల్లి: మండివీధిలో వినాయకుని వద్ద పోటెత్తిన భక్తులు


కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో సామూహిక వినాయక పూజల్లో మహిళలు


చోడవరం: స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజు


కె.కోటపాడు: సింగన్నదొరపాలెంలో వినాయకునికి పూజలు చేస్తున్న పార్టీ నాయకుడు వెంకటరమణ


కె.కోటపాడు: చౌడువాడలో వినాయక ప్రతిమ అనుపు చేస్తున్న చిన్నారులు


బుచ్చెయ్యపేట: వడ్డాదిలో...

**నర్సీపట్నం/మాకవరపాలెం/కె.కోటపాడు/బుచ్చెయ్యపేట/దేవరాపల్లి/రోలుగుంట/నాతవరం/గొలుగొండ/మాడుగుల/రూరల్:** గ్రామాల్లో చవితి పందిర్లు నిర్మించి వివిధ రూపాల్లో రూపొందించిన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో గణేష్ మహారాజ్‌కీ ప్రత్యేక పూజలు చేశారు. పోటా పోటీగా ఖరీదైన పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని నర్సీపట్నంలోని అయ్యారక వీధిలో 22 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

**చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరునికి పూజలు**

**చోడవరం:** ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య ఆదిదేవుడు.. స్వయంభూ విఘ్నేశ్వర స్వామివారికి చవితి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉత్సవాలను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ప్రారంభించారు. సాయంత్రం స్వామివారి తిరువీధోత్సవం ఘనంగా జరిపారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, మాజీ చైర్మన్ ఉప్పల సతీష్ ఉత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మూషిక వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఉంచి పట్టణ పురవీధుల్లో సాంప్రదాయంగా ఊరేగింపు నిర్వహించారు. మెయిన్ రోడ్డుపై ప్రత్యేక విద్యుత్ అలంకరణతో ఆలయ ప్రాంగణం కనువిందు చేసింది. భారీగా బాణసంచా కాల్చారు. అన్నమాచార్య సంగీతం పీఠం విద్యార్థులు సంగీత విద్వాంసుడు రామయ్యరెడ్డి ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు.

**పసుపు అలంకరణలో దర్శనం**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి వారు హరిద్రవర్ణ పసుపు అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులు కనులారా దర్శించుకొని తరించారు.

## జమీలు కుటుంబానికి అండగా ఉంటాం

**మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్**


జమీలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

**నాతవరం:** దివంగత నేత అంకంరెడ్డి జమీలు కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తాను కూడా అన్ని విధాలుగా సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. నాతవరంలో అంకంరెడ్డి జమీలు ద్వితీయ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జమీలు లేని లోటు పూడ్చలేనిదన్నారు. 2019లో తాను ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో అందించిన సహకారం ఎల్లప్పుడూ గుర్తుంటుందన్నారు. మండలంలోని స్థానిక సంస్థలు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు విశేష కృషి చేశారన్నారు. అనంతరం జమీలు భార్య, డీసీసీబీ మాజీ డైరెక్టరు అంకంరెడ్డి పార్వతి, కుమార్తె వైద్యాధికారి సౌమ్య, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుకలకు మనోధైర్యం కల్పించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా ప్రభావతి, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టరు పైల పోతురాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సబ్బవరపు వెంకునాయుడు, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మను శెట్టి నూకరాజు, సర్పంచులు మిరపల వెంకటరమణ, మలపురెడ్డి బాబ్జి. జివిరెడ్డి సోమన్నదొర, కాళ్ల సత్యనారాయణ, గుడపర్తి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ, మాజీ సర్పంచులు మాకిరెడ్డి వెంకటరమణ, లాలం లోవ, సుర్ల యోగీశ్వరుడు, పార్టీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు పాల్గొన్నారు.

## వరద బాధితులకు వస్త్రాలు, సరకుల సరఫరా


వ్యాన్ ద్వారా దుస్తులు, నిత్యావసర సరకులు పంపిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

**అనకాపల్లి:** స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు పట్టణ ప్రజల సహకారంతో సుమారు 1500 చీరలు, తువ్వాళ్లు, నైటీలు, లుంగీలు, దుప్పట్లు, 500 నిత్యావసర సరకుల కిట్లను ఆదివారం వ్యాన్ ద్వారా విజయవాడకు పంపించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం సుమారుగా రూ.6 లక్షల విలువైన వస్త్రాలు, సరకులు పంపించినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రొగ్రాం చైర్మన్ బుద్ద రమణాజీ, సభ్యులు కడిమిశెట్టి సతీష్, రాజేష్‌నాయుడు, కె.ఎల్.ఎన్. కుమార్, సోమసుందర్, పి.చందు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**అనకాపల్లి :** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సుమారు 50 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉండగా తమిళనాడులో అక్కడి ప్రభుత్వం బీసీ జనాభా ఆధారంగా 69 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, మన రాష్ట్రంలో బీసీలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శ్రీలక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన యాదవ విద్యార్థులకు ఆయన ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా విభజనకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంపొందించే అవకాశాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం పూర్తి అయితే ఈ ప్రాంత సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు. అనంతరం 200 మంది విద్యార్థులకు రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. వెయ్యి చొప్పున నగదుతో పాటు, విద్యా సామగ్రి కలిపి ప్రతిభా పురస్కారాలు అందజేశారు.